# తెలంగాణ రాష్ట్ర సమితి

**Dr.Boora Narsaiah Goud**
(MS, FAIS, FICS,FMAS)
**EX-MP & TRS Party Bhongir Parliament Incharge)**

గౌరవనీయులైన శ్రీ కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు, తెరాస అధ్యక్షులు గారికి

ఆర్య!

**విషయం: తెరాస పార్టీకి నా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయుట గురించి.**

**2009 – 2014:**

నేను తెలంగాణ ఉద్యమంలో మీ నాయకత్వంలో టి-జాక్ లో భాగంగా 2009 నుండి నా బిజీ ప్రాక్టీస్ ను కూడా లెక్కచేయకుండా కేవలం తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు శక్తి వంచన లేకుండా ఉద్యమంలో పాల్గొనడం జరిగింది. తెలంగాణ రాష్ట్రము రావడం వల్ల అందరి కల నెరవేరింది. తెలంగాణ రాష్ట్రంలో మీరు నాకు భువనగిరి నుండి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వడం జరిగింది.

**2014 – 2019:**

భువనగిరి ఎంపీగా గెలిచిన తదుపరి నేను శక్తి వంచన లేకుండా, నియోజక అభివృద్ధికి, ఇటు తెలంగాణ అభివృద్ధికి కృషి చేశాను. దాని ఫలితమే ఏయిమ్స్ , కేంద్రీయ విద్యాలయం, జాతీయ రహదారులు , ఇలా ఎన్నో అభివృద్ధి పనులు. ఇటు ఢిల్లీలో కూడా తెలంగాణ అభివృద్ధికి, నా వంతు పాత్ర పోషించాను. ఎలాంటి అవినీతి, ఆరోపణ లేకుండా పనిచేసాను. తెలంగాణ ప్రగతితో పాటు, తెరాస పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేశాను.

**2018 -** అసెంబ్లీ ఎన్నికలు:

భువనగిరి పార్లమెంటు ఏరియా ఎంఎల్ఏ ల గెలుపు కొరకు నా శక్తి మేరకు కృషి చేశాను, ప్రచారం చేశాను. కేవలం మళ్ల తెరాస గెలవాలని , మీరు ముఖ్య మంత్రి కావాలని కసితో తిరిగాను. నా పాత్ర చిన్నది అయినా కొంత ఎంఎల్ఏ ల గెలుపు కొరకు తోడ్పడింది.

**2019 -** పార్లమెంటు ఎన్నికలు**:**

మీరు నాకు మళ్ల ఎంపీ గా పోటీ చేసే అవకాశం ఇచ్చారు. నేను 5 ఏండ్లలో చేసిన అభివృద్ధి పనులు గెలిపిస్తాయి అని అందరు ఊహించారు, కానీ స్వల్ప మెజారిటీతో , బుల్డోజర్ గుర్తు, అంతర్గత కుట్రల వలన ఓడిపోయాను. అది మీకు తెలుసు. మీరు నాకు మళ్ల పోటీ చేసే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞత భావంతో ఇన్నాళ్లు ఎన్నో అవమానాలు జరిగిన భరించాను.

మే 25 , 2019 ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు నుండి, నియోజక వర్గంలో తిరుగుతు, తెరాస పార్టీలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉన్నాను. కానీ ఎంపీగా ఓడిపోయిన తర్వాత నేను ఎదురుకున్న అవమానాలు, అవరోధాలను కేవలం మీరు నాకు పోటీ చేసే అవకాశం ఇవ్వడం వలన, అలానే మీ కుటుంబ సభ్యులతో ఉన్న అనుబంధం వలన హాలాహలంగా భరించాను. పదవులకొరకు, పైరవీలు చేసే వ్యక్తిత్వం కాదని తెలిసి కూడా, మీరు కనీసం కలిసి ప్రజల సమస్యలు విన్నవించుకునే అవకాశం కూడా కల్పించలేదు. బడుగు బలహీన వర్గాలు సమస్యలను నేను పదే , పదే ప్రస్తావించడం, దానిపై మీరు నా పై అసహనం వ్యక్తం చేయడం ఒక ఉద్యమ కారుడిగా ఎంతో బాధించింది. నేను ఎప్పుడు ప్రజల సమస్యలు తప్ప, వ్యక్తిగత ప్రయాజనాల కొరకు మీ వద్ద పైరవీలు చేయలేదు.

కానీ నాకు మునుగోడు ఉప ఎన్నికల సమయంలో నా యొక్క అవసరం పార్టీకి లేదని తెలిసింది.

1. ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు వలన ఉదాహరణకు ధరణి, జిపి లేఔట్స్ రెజిస్ట్రేషన్స్ బ్యాన్ చేయడం, దళితుల అసైన్డ్ భూములు తీసుకొని ప్రభుత్వం లై ఔట్స్, సర్పంచులకు ఉప సర్పంచ్ సంతకం అనే సవితి పోరు, కుల వృత్తులు ఫెడరేషన్స్ నిర్వీర్యం చేయడం, బీసీ, ఈబీసీ పేద పిల్లలకి కేవలం 11% వరకే ఫీ రేయింబర్సుమెంట్ ఇవ్వడం లాంటి అనేక అంశాలు ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తెస్తున్నవి అని మీ దృష్టికి తీసుకోవద్దామంటే అవకాశమే ఉండదు. ఇక నేను తెరాస పార్టీలో ఉండి ఏమి చేయాలి.

2) ఉద్యమ సమయంలో ఇతర ప్రాంతం వాళ్ళు ఇక్కడ రొయ్యలు అమ్ముకోవచ్చు, లేదా కర్రీ పాయింట్స్ పెట్టుకోవొచ్చు, కానీ ప్రభుత్వం , సచివాలయంలో మాత్రం కేవలం తెలంగాణ ప్రజలు ఉంటారని మైకుల్లో మోగేటట్లు చప్పట్ల మధ్య చెప్పాం . కానీ ఒక విషయం చెప్పాలి తెలంగాణ కాంట్రాక్టర్లు ఎలా భావిస్తు న్నారు అంటే " తెలంగాణ కాంట్రాక్టర్ల ఏడాది టర్నోవర్, ఇతర ప్రాంత కాంట్రాక్టర్ల TDS అంత కూడా లేదని వాపోతున్నారు.

3) తెలంగాణ ఉద్యమంలో రోజులు, నెలలు, ఏండ్లు గడిపిన మీ సన్నిహితులు , సహచర ఉద్యమకారులు కనీసం ఒక నిముషం మీతో కలవాలంటే తెలంగాణ ఉద్యమం కంటే పెద్ద ఉద్యమం చేయవలసి వస్తుంది అని భావిస్తున్నారు. తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికి అంకితం చేసిన ఆచార్య జయశంకర్ గారి కనీసం 6 అంగుళాల విగ్రహం హైదరాబాద్ లో ప్రభుత్వం తరపున పెట్టకపోవడం, అందరిని బాధిస్తున్న అంశం.

4) మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ఒక మాజీ ఎంపీ అయినప్పటికీ , ఒక్క సారి కూడా మాతో సంప్రదించలేదు. నియోజకవర్గంలో జరిగిన ఆత్మగౌరవ సభలలో, మాకు ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వకున్నా, అవమానాన్ని దిగమింగి ఉన్నాను . అది మీకు తెలిసి కూడా మౌనంగా ఉన్నారు. మునుగోడు టికెట్ అసలు నాకు సమస్యనే కాదు, కానీ బీసీ సామజిక వర్గానికి టిక్కెట్ పరిశీలించండి అని అడగటం కూడా నేరమే అయితే అసలు ఈ పార్టీలో ఉండటమే అనవసరం. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో బీసీలకు ఆర్థిక, రాజకీయ, విద్య , రంగాలలో వివక్షకు గురికావడం బాధాకరం.

మీరంటే అభిమానం, ఇచ్చిన అవకాశాలకు కృతజ్ఞతో ఇప్పటి వరకు ఉన్నాను, కానీ అభిమానానికి , బానిసత్వానికి చాల తేడా ఉంది. నేను వ్యక్తిగతంగా అవమాన పడ్డా, అవకాశాలు రాకున్నా పర్వాలేదు కానీ అట్టడుగు వర్గాల సమస్యలు కనీసం మీ దృష్టికి తీసుకు వచ్చే అవకాశమే లేనప్పుడు, నేను తెరాస పార్టీలో కొనసాగడం అర్ధరహితం. రాజకీయ వెట్టి చాకిరీ తెలంగాణ ప్రజలు ఎక్కువ కాలం భరించలేరు.

తెరాస తో,మీ కుటుంబ సభ్యులతో రాజకీయ బంధం దూరమైనందుకు చింతుస్తు, తెరాస పార్టీకి రాజీనామా చేస్తున్నాను.

ఇట్లు



**(డాక్టర్ బూర నర్సయ్య గౌడ్)**
మాజీ ఎంపీ – భువనగిరి